హైవే విస్తరణ పనుల సందర్భంగా వాహనాల మళ్లింపు


నాగరాజు, అల్వాల్ ట్రాఫిక్ సీఐ

కుత్బుల్లాపూర్: నేషనల్ హైవే - 44 విస్తరణ పనుల నేపథ్యంలో వాహనదారులు సహకరించాలని అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు కోరారు. పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ సమీపంలో శనివారం ఫ్లైఓవర్ పనులు ప్రారంభమవుతున్న సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు చేపట్టామన్నారు. కొంపల్లి నుంచి సుచిత్రకు వచ్చే వాహనాలను రిలయన్స్ పెట్రోల్ బంక్ నుంచి సర్వీస్ రోడ్డు మీదుగా పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్, అదే విధంగా సుచిత్ర నుంచి కొంపల్లి వైపు వెళ్లే వాహనాలను పిల్లర్ నెంబర్ 4 సమీపంలో సర్వీస్ రోడ్డు నుంచి ఎన్‌సీఎల్ బస్టాప్ మీదుగా మళ్లించనున్నట్లు తెలిపారు. డీ - మార్ట్ మీదుగా సెయింట్ ఆన్స్ స్కూల్, ఎన్‌సీఎల్ బస్టాప్ నుంచి సురక్ష ఆసుపత్రి వైపు సర్వీసు రోడ్డులో అపొజిట్ డైరెక్షన్‌లో వాహనాలను అనుమతించమని, ఈ విషయాన్ని గమనించి తమ సిబ్బందికి సహకరించాలని సీఐ కోరారు.

మున్సిపల్ కార్మికులను ఉద్యోగులుగా గుర్తించాలి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్

నిజాంపేట్: మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పాలబిందెల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్న కార్మికులతో శుక్రవారం మున్సిపల్ అధ్యక్షుడు యాదయ్య ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు ప్రతి నెలా రూ.26 వేల జీతాన్ని వర్తింప జేయాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు చేయించడంతో పాటు చీపుర్లు, చెప్పులు, కొబ్బరి నూనె, సబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా శ్రీనివాస్, అధ్యక్షుడిగా యాదయ్య, కార్యదర్శిగా దుర్గయ్య, ఉపాధ్యక్షులుగా నర్సమ్మ, భాగ్యమ్మ, సహాయ కార్యదర్శులుగా అమృతమ్మ, యాదమ్మ, లక్ష్మి, నాగమ్మ, శ్రీను, నాగయ్య, కృష్ణ, లక్ష్మీనారాయణ తదితరులను ఎన్నుకున్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ విద్యా శాఖ సమగ్ర శిక్ష విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఇతర పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్)డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం మేడ్చల్ కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల శిబిరాన్ని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్ సందర్శించి వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్వితీయ శ్రేణి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని, సీఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. 2023లో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీని విస్మరించడం శోచనీయమన్నారు. జిల్లా స్థాయిలో సిస్టం అనలిస్ట్, టెక్నికల్ పర్సన్స్, ఆపరేటర్లు, డేటా ఎంట్రీ, క్లస్టర్ రిసోర్స్ పర్సన్, స్పెషల్ ఆఫీసర్స్, అటెండర్లుగా పని చేస్తున్న 109 మంది ఉద్యోగులు నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని విద్యా శాఖలో విలీనం చేసి, రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగ భద్రతతో కూడిన పేస్కేల్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఫణి కుమార్, ప్రతినిధులు దేదీప్య, మల్లేష్, కిరణ్, స్వామి,సత్యనారాయణ, ఇందిరా, మధులత, నిర్మల పాల్గొన్నారు.

వివిధ సంఘాల మద్దతు

న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు టీఎస్‌యూటీఎఫ్, ఎస్‌టీయూ, టీయూటీఎఫ్ సంఘాలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. ఆయా సంఘాల జిల్లా నేతలు జయసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, మదన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు వారికి మద్దతుగా దీక్షలో పాల్గొన్నారు.

పండుగ చేసుకుందాం..

- నేడు సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో సంబురాలు
- వసతి గృహాలు, గురుకులాల విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచిన ప్రభుత్వం
- హాజరుకానున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు
- సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థులతో ముఖాముఖి



సాక్షి,సిటీబ్యూరో: మెస్ చార్జీలను పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం విద్యాలయాల్లో సంబురాలు నిర్వహించనున్నారు. గురుకులాలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు 8 ఏళ్ల తర్వాత ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచింది. అంతేగాక 16 ఏళ్ల తర్వాత విద్యార్థులకు నెలవారీగా అందించే కాస్మోటిక్ చార్జీలు, సబ్బుల చార్జీలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. మూడో తరగతి నుంచి 7వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు మెస్ చార్జీలు నెలకు రూ.950 నుంచి రూ.1330కు పెంచగా, కాస్మోటిక్ చార్జీలు రూ.55 నుంచి రూ.175 వరకు, 8వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నెలకు మెస్ చార్జీలు రూ.1100 నుంచి రూ.1540వరకు, కాస్మోటిక్ చార్జీలు రూ.75 నుంచి రూ.275 వరకు పెంచారు . హెయిర్ కటింగ్ చార్జీలు 3 నుంచి 7వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రూ.62 నుంచి రూ.150 వరకు, 8 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రూ.62 నుంచి రూ.200 వరకు ప్రభుత్వం పెంచింది. అలాగే కాలేజీ విద్యార్థులకు నెలకు మెస్ చార్జీలు రూ.1500 నుంచి రూ.2100 కు పెంచారు.

వేడుకలు ఇలా..

మేడ్చల్ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీలకు సంబంధించిన 61 హాస్టళ్లు, గురుకుల విద్యాలయాల్లో ప్రముఖులను ఆహ్వానించి, విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో రోజువారీగా అందించే ఆహార పదార్థాల పట్టికను ఈ సందర్భంగా ప్రదర్శించనున్నారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన పదార్థాలతో రుచిగా, శుచిగా ఆహారాన్ని వండి వడ్డిస్తున్నారని అవగాహన కల్పించనున్నారు. ప్రతి ఆదివారం మెనూలో విద్యార్థులకు ప్రత్యేకంగా చికెన్‌తో వండి వడ్డించే ఆహారాన్నే ఆ రోజు పాల్గొన్న ప్రముఖులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు విందు భోజనంగా అందించనున్నారు

కార్యక్రమాలు ఇవీ..

మేడ్చల్ జిల్లాలో శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 వరకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి/ఎంపీ/ఎమ్మెల్యే/ఎమ్మెల్సీ /కలెక్టర్/ కమిషనర్ తదితర ప్రముఖులు హాస్టళ్లను సందర్శించి తనిఖీలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 నుంచి 12.30 సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ప్రముఖులు సహపంక్తి భోజనాలు చేస్తారు.

మల్లికార్జున స్వామి సేవలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



దుండిగల్: శ్రీశైలంలోని మల్లికార్జున స్వామిని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

నెట్ బాల్ జట్ల ఎంపిక



కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లో ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ నెట్ బాల్ మెన్ అండ్ ఉమెన్ జట్లను సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రొఫెసర్ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ నల్లగొండ అశోక్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపిక చేశారు. జైపూర్‌లోని సురేష్ జ్ఞాన్ విహార్ యూనివర్సిటీలో జనవరి 3 నుంచి 7వ తేదీ వరకు జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్‌లో ఈ జట్లు పాల్గొంటాయని తెలిపారు. ఈ సెలక్షన్స్‌లో చీఫ్ సెలక్టర్‌గా డాక్టర్ ఎస్ సోమేశ్వర్ కుమార్ వ్యవహరించారు.

మహిళ హత్య కేసులో పోలీసుల పురోగతి!

- అన్ని సీసీ కెమెరాల పరిశీలన
- అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ

జీడిమెట్ల: ఈనెల 10వ తేదీ తెల్లవారు జామున జరిగిన మహిళ హత్య కేసులో జీడిమెట్ల పోలీసులు పురోగతి సాధించినట్లు తెలుస్తోంది. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే జరిగిన దారుణహత్య పోలీసులకు సవాల్‌గా మారింది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు దర్యాప్తులో అవసరమైన అన్ని సాంకేతిక ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా చింతల్ నుంచి ఐడీపీఎల్ వరకు, కుత్బుల్లాపూర్ నుంచి గాజులరామారం వరకు ఉన్న అన్ని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఎట్టకేలకు అనుమానం ఉన్న కొంతమందిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం అసలు నిందితుడిని పోలీసులు గుర్తించారని సమాచారం. సదరు మహిళ ఎవరు, ఆమె కొన్ని నెలలుగా చింతల్ ప్రాంతంలో ఎందుకు ఉంటుందని పోలీసులు కూపీ లాగారు. బుధవారం రోజు ఆమెను ఓ వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై కుత్బుల్లాపూర్‌లో దింపి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. విశ్వసనీయ సమాచారం మేరకు అసలు నిందితుడిని పోలీసులు రేపో, మాపో మీడియా ముందు ప్రవేశపెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది.

ముగిసిన ప్రజాపాలన క్రీడా పోటీలు


మెమొంటోలు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ శ్రీశైలంయాదవ్

కుత్బుల్లాపూర్: ప్రజాపాలనలో విజయోత్సవాల్లో భాగంగా కొంపల్లి మున్సిపల్ స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వంటి క్రీడలు నిర్వహించగా.. యువత, కొంపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శుక్రవారం పాఠశాల ఆవరణలో మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్ జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీహరి, మేనేజర్ వెంకటేశం, కార్యాలయ అధికారులు, సిబ్బంది, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


దాత శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నిజాంపేట్: మధురానగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న అష్టలక్ష్మి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయానికి శుక్రవారం శ్రీనివాసనగర్ కాలనీకి చెందిన మేడా శ్రీనివాసరావు విరాళం అందజేశారు. ఆలయ ముఖద్వారం నిర్మాణానికి తనవంతు సహాయంగా రూ.98 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసరావును సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు విష్ణువర్ధన్‌రావు, రాంబాబు, హన్మంత్ రావు, అప్పుల రాజు, పురోహితులు పాల్గొన్నారు.


జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డలోని ఎన్నా చెరువు

వెన్నెలగడ్డ ఎన్నా చెరువు.. అభివృద్ధికి ఇంకెనాళ్లు?

- గతంలో సరిపడా నిధులు లేక ఆగిన పనులు
- శివారు చెరువుల నిధుల కేటాయింపుతో మళ్లీ తెరపైకి
- ఈ సారైనా ఆధునీకరణ పూర్తయ్యేనా?

కుత్బుల్లాపూర్ : సర్కిల్ పరిధిలోని వెన్నెల గడ్డ ఎన్నా చెరువును ఆధునీకరించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. గతంలో ఈ చెరువు ఆధునీకరణకు సుమారు రూ. 1.70 కోట్లు మంజూరయ్యాయి. కాగా తూతూ మంత్రంగా పనులు చేపట్టి నిధులు లేక పోవడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే నగరం నగర శివారు ప్రాంతాల్లో ఉన్న 47 చెరువులను అభివృద్ధి చేసేందుకు సుమారు రూ.141 కోట్లు ఎన్‌డీఎంఎఫ్ నిధులతో చెరువుల ఆధునీకరణ చేపట్టేందుకు యంత్రాంగం ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ క్రమంలో కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డ ఎన్నా చెరువు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ చెరువులో వ్యర్థ జలాలు కలువకుండా సివరేజ్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. తాజాగా చెరువు ఆధునీకరణకు అధికారులు కసరత్తు చేయడంతో ఈ ప్రాంతం పర్యటక ప్రాంతంగా మారే అవకాశం ఉంది. సమీప కాలనీల ప్రజలకు ఇక్కడ మౌలిక వసతులు ఏర్పాటు చేస్తే ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుంది. ఇప్పటికే వెన్నెలగడ్డ కాలనీవాసులతో పాటు అటు జీడిమెట్ల పరిసర ప్రాంతాల్లో ఉండే వారికి ఇది ఉపయోగంగా ఉంటుంది. అయితే చెరువుల అభివృద్ధి విషయంలో ఒకవైపు గ్రేటర్ అధికారులు సన్నద్ధం అవుతున్నారు. మరోవైపు హద్దులు ఏర్పాటు చేసే విషయంలో హెచ్ఎండీఏ అధికారులు చొరవ చూపకపోవడం మూలంగా ఈ చెరువు అభివృద్ధి పనులు ఒక అడుగు ముందుకు..! రెండు అడుగులు వెనక్కి..!! అన్న చందంగా మారింది.

వర్షాలు పడ్డ ప్రతిసారి ఇబ్బందులే..

జీడిమెట్ల డివిజన్ పరిధిలోని వెన్నెలగడ్డ ఎన్నా చెరువు వర్షం పడ్డ ప్రతిసారి పొంగి పొర్లడం పరిపాటుగా మారింది. ఈ నేపథ్యంలో చెరువు దిగువ ప్రాంతంలో ఉన్న కాలనీలు నీట మునగడం, ప్రజలు ఇబ్బందులు పడటం జరుగుతోంది. ముఖ్యంగా గోదావరి హోమ్స్, గాయత్రి నగర్ కాలనీవాసుల పరిస్థితి చెప్పనక్కరలేదు. నాలా అలుగు ఇప్పటికే పూర్తిస్థాయిలో కబ్జాకు గురి కావడం.. ఇరుపక్కల భారీ నిర్మాణాలకు టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతులు ఇవ్వడం ఇప్పుడు సమస్యగా మారింది. అలుగు పారే వర్షపు నీరు వెళ్లే క్రమంలో అన్ని నిర్మాణాలు అడ్డుగా ఉండటం మూలంగా పైన పేర్కొన్న రెండు కాలనీలు నీట మునుగుతూ వస్తున్నాయి. ఈ క్రమంలో అధికారుల హడావుడి తప్ప శాశ్వత పరిష్కారం చూపకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైన సరిపడా నిధులు కేటాయించి వెన్నెలగడ్డ ఎన్నా చెరువును అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయ ప్రహరీకి భూమిపూజ



సుభాష్‌నగర్: దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని కౌన్సిలర్ ఎల్లుగారి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లి 13వ వార్డులోని వినాయక్ నగర్ కాలనీలో వినాయకుడి గుడి ప్రహరీ నిర్మాణానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. బస్తీ వాసులు ఐక్యంగా ఉండి ఆలయ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో రవి నాయక్, ఆలయ కమిటీ ప్రెసిడెంట్ మల్లేష్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, పండ్లు పంపిణీ



రంగారెడ్డినగర్: కాంగ్రెస్ నేత, వివేకానంద యూత్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వల్లెపు కృష్ణ 43వ జయంతిని శుక్రవారం అభిమానులు ఘనంగా నిర్వహించారు. రంగారెడ్డినగర్ ప్రాథమిక పాఠశాల, గాజులరామారం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు వల్లెపు వేణుకుమార్, వివేకానంద యూత్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సురేష్, శ్రీనివాస్, రవి, పవన్‌గుప్తా, ప్రతాప్, అంజిరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, కామేశ్వరరావు, రాంబాబు, విజయ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం


ఎగిసి పడుతున్న మంటలు

కుత్బుల్లాపూర్ : షార్ట్ సర్క్యూట్‌తో పెళ్లి డెకరేషన్ సామగ్రి ఖాళీ బూడిదైన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. కొంపల్లి సినీ ప్లానెట్ సమీపంలో మాధవరెడ్డి అనే వ్యక్తి పెళ్లికి సంబంధించిన డెకరేషన్ సామగ్రిని శుభకార్యాలకు సరఫరా చేస్తాడు. శుక్రవారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి సామగ్రి కాలిపోయింది. సకాలంలో జీడిమెట్ల ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మండల స్థాయి క్రీడలు ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలు ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌యాదవ్

సుభాష్‌నగర్: ఓటమి విజయానికి నాంది అని బాక్సింగ్ ఛాంపియన్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గాజులరామారం డివిజన్ మెట్ కానిగూడలోని విజ్ఞాన్ ఉషోదయ స్కూల్‌లో శుక్రవారం మండల స్థాయి అంతర్ పాఠశాలల ఆటల పోటీలు నిర్వహించారు. రెండు రోజుల పాటు జరుగనున్న ఈ క్రీడలను స్కూల్ ప్రిన్సిపాల్ జానెట్ అంగారెత్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఖోఖో, కబడ్డీ, త్రో బాల్, అథ్లెటిక్స్ పోటీలకు 15 స్కూళ్ల నుంచి 1100 విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలూ అవసరమన్నారు. కార్యక్రమంలో అనూష్ జైస్వాల్, శ్రీనివాస్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లకు ప్రముఖుల పేర్లు పెట్టాలి

కేపీహెచ్‌బీకాలనీ: విశ్వవిద్యాలయంలో నిర్మించే నూతన వసతి గృహాలకు సంత్ సేవాలాల్ బాలుర వసతి గృహంగా, ఝల్కారీ బాయి బాలికల వసతి గృహంగా నామకరణం చేయాలని జేఎన్‌టీయూ ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయంలో రెండు వసతి గృహాలను నూతనంగా ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సాధ్యమైనంత త్వరగా ఆయా వసతి గృహాలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. వసతి గృహాలను ఎస్సీ, ఎస్టీ నిధులతో నిర్మిస్తున్నందున ఆయా వసతి గృహాలకు, ఆయా దళిత, గిరిజన జాతుల్లో పుట్టి దేశానికి, సమాజానికి సేవలు చేసిన వారిలో ప్రముఖుల పేర్లను నామకరణం చేయాలన్నారు.

మెరుగైన వైద్య సేవల్లో మేడ్చల్ జిల్లా ఫస్ట్

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్.టి. రఘునాథ్‌స్వామి



సాక్షి,సిటీబ్యూరో: ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రఘునాథ్‌స్వామి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు అందించడంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్రంలోనే ముందంజలో ఉందన్నారు. పలు పథకాలు మేడ్చల్ జిల్లా నుంచి ప్రారంభం కావడమే ఇందుకు నిదర్శనంగా పేర్కొన్నారు.

- జిల్లాలో టీబీ ఫ్రీ జోన్ ను ఏర్పాటు చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టిందని, ఇందుకు మూడు మున్సిపల్ కార్పొరేషన్లను పైలట్ ప్రాజెక్టుగా ఎంచుకున్నామన్నారు. ఇందుకు స్వచ్ఛంద సంస్థలు కూడా సహకరిస్తున్నట్లు తెలిపారు. అడల్ట్ బీసీజీ, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు టీబీ పై అవగాహన తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.
- జిల్లాలో రోహిణి ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో స్కూల్ విద్యార్థులకు స్క్రీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా పిల్లల్లో రక్త హీనత, పళ్లను పరీక్షించి అవసరమైన చికిత్స అందజేయనున్నట్లు తెలిపారు. పేదలు ఎక్కువగా నివసించే జవహర్ నగర్, బాలాజీ నగర్ లాంటి ప్రాంతాల్లో మొబైల్ వ్యాన్ల ద్వారా సేవలు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. డయాబెటిక్ వ్యాధి గ్రస్తుల్లో పెరిపెరల్ స్టేజీ ని ముందుగానే గుర్తించి, వారికి అవసరమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు.
- గర్భిణుల్లో రక్త హీనతను గుర్తించి, వారికి తగిన విధంగా వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్ డా.శ్రీదేవి, డా.కౌశిక్ పాల్గొన్నారు.

టీపీసీసీ లేబర్ సెల్ సోషల్ మీడియా రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా భాస్కర్

మూసాపేట: టీపీసీసీ లేబర్ సెల్ సోషల్ మీడియా రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా మూసాపేటకు చెందిన సప్పిడి భాస్కర్‌కు శుక్రవారం టీపీసీసీ లేబర్ సెల్ చైర్మన్ ఆర్. ప్రకాష్ గౌడ్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లేబర్ సెల్ తరఫున కార్మిక చట్టం పరిధిలోకి వచ్చే అర్హులైన అన్ని రంగాల కార్మికులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు.